క్లుప్తంగా

మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ

శంషాబాద్ రూరల్: మండలంలోని ముచ్చింతల్ సమీపంలో ఉన్న స్వర్ణభారత్ ట్రస్టు ఆవరణలో గ్రామీణ మహిళలకు మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ మరియు స్వర్ణ భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 29 నుంచి తరగతులు ప్రారంభంకానున్నాయి. 19 నుంచి 45 ఏళ్ల వయస్సు కల్గి ఆసక్తి ఉన్న వారు రేషన్, ఆధారు కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను తీసుకుని కార్యాలయంలో సంప్రదించాలన్నారు. 30 రోజుల పాటు నిర్వహించే ఈ తరగతులకు హాజరయ్యే వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యంతో పాటు యూనిఫాం, టూల్ కిట్స్ అందజేస్తారు. మరిన్ని వివరాలకు 9391487797, 9177141712, 6301890681, 9618534720 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీధర్

శంషాబాద్: బహదూర్‌గూడ గ్రామంలో నిర్మిస్తున్న ఆలయానికి బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్ రూ.50 వేలు అందజేశారు. ఆలయాల ద్వారా మన సంస్కృతి తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుమార్, వినోద్, ప్రభాకర్, హరీష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత



శంషాబాద్: తప్పిపోయిన బాలికను సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు పోలీసులు. శంషాబాద్ బస్టాండ్‌లో ఏడుస్తూ ఉన్న బాలిక(4)ను గుర్తించిన కొందరు కళాశాల విద్యార్థులు ఆర్‌జీఐఏ పోలీసులకు సమాచారం అందించారు. చిన్నారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చిన పోలీసులు వెంటనే పాప ఫొటోను సామాజిక మాధ్యమాల్లో ఉంచడంతో కవ్వగూడకు చెందిన ధన్‌రాజ్, భార్గవిల కుమార్తె (4)గా గుర్తించారు. వారిని పిలిచి తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

శుభాకాంక్షలు



ఫిషరీస్ చైర్మన్ రవీందర్‌కు శుభాకాంక్షలు తెలిపిన తలారి మల్లేష్

మణికొండ: రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్‌గా మంగళవారం ప్రమాణ స్వీకారం చేసిన పిట్టల రవీందర్ ముదిరాజ్‌కు జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు తలారి మల్లేశ్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయన కార్యాలయంలో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు గడ్డ కుమార్ ముదిరాజ్, చిలుకూరు మత్స్య సహకార సంఘం, జిల్లా మహాసభ సలహాదారుడు శ్రీరాములు, గండిపేట మండల అధ్యక్షుడు రాజేందర్ ముదిరాజ్, నాయకులు శ్రీనివాస్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

'నందకిషోర్‌కు టికెట్ ఇస్తే గెలిపించుకుంటాం'

నాంపల్లి: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి నందకిషోర్ వ్యాస్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని గోషామహల్ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ కో ఇన్‌చార్జి చిలకల నరేందర్ మాదిగ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆగాపురలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. నందకిషోర్ వ్యాస్ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడని ప్రశంసించారు. రాబోయే ఎన్నికల్లో గోషామహల్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ పార్టీ నందకిషోర్ వ్యాస్‌కు పార్టీ టికెట్ కేటాయించాలని సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, మహమ్మద్ మహమూద్ అలీకి విజ్ఞప్తి చేశారు. నంద కిషోర్ వ్యాస్‌కు టికెట్ కేటాయిస్తే గోషామహల్‌లో గులాబీ జెండా ఎగురవేయడం ఖాయమైనట్లేనని అన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోండి

మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్



అలకాపూర్ టౌన్‌షిప్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు అలకాపూర్ టౌన్‌షిప్‌లోని ఎంజీ పార్కులో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన కౌన్సిలర్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం తీసుకుంటున్న ఆహారంలో సమతుల్యత లేకపోవటంతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. అలాంటి వాటిని సకాలంలో గుర్తించి వైద్య సలహాలు, అవసరం అయితే కంటి అద్దాలు తీసుకుని కంటి సమస్యలను నివారించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్‌లు ఎ.నవీన్‌కుమార్, బి.పద్మారావు, వంసతరావు, లక్ష్మీనారాయణ, కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు బి.శ్రీరాములు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జితేందర్, నాయకులు జయరాజ్, వైద్య సిబ్బంది, టౌన్‌షిప్ ప్రజలు పాల్గొన్నారు.

జీఓ111 ఎత్తివేతపై హర్షం

● సీఎం కేసీఆర్‌ను కలిసిన మండలవాసులు

శంషాబాద్ రూరల్: గ్రామాల అభివృద్ధికి అడ్డంకిగా మారిన జీఓ 111 ఎత్తివేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో మండలంలోని ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఆయనను కలిసి సన్మానించారు. జీఓ తొలగింపుతో అన్ని వర్గాల వారు ముఖ్యంగా రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని ఈ సందర్భంగా సీఎంకు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్, జడ్పీటీసీ తన్వీరాజు, రైతు సంఘం మండల అధ్యక్షుడు కొత్త యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సన్మానించిన వైస్‌చైర్మన్

శంషాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్‌ను శంషాబాద్ మున్సిపల్ వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్ సచివాలయంలో సన్మానించారు. దశాబ్దాలుగా తమ ప్రాంత అభివృద్ధికి నిరోధకంగా మారిన జీఓ 111 ప్రభుత్వం ఎత్తివేసినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌లు జీఓ 111 సమస్యపై ప్రత్యేక చొరవ తీసుకున్నందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న రైతు సంఘం మండలాధ్యక్షుడు యాదగిరిరెడ్డి



ముఖ్యమంత్రి కేసీఆర్‌ను శాలువాతో సన్మానించిన మున్సిపల్ వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ చంద్రశేఖర్

బండ్లగూడ: మన ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నపుడే ఆరోగ్యం కలుగుతుందని బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ 1వ వార్డు కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రత్యేక డ్రైవ్‌ను హైదర్షాకోట్ 1వ వార్డు జేఎస్ఎన్‌యుఆర్ఎం వీకర్ సెక్షన్ కాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, పర్యవేక్షించిన ఆయన మాట్లాడుతూ రోడ్ల పక్కన చెత్త లేకుండా చూడాల్సిన బాధ్యత కార్పొరేషన్ సిబ్బందితో పాటు స్థానికుల పైనా ఉందన్నారు. మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకోకపోతే అనేక రోగాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ మేనేజర్ నరేష్, వార్డు జవాన్‌లు రామాంజనేయులు, నరేష్, యాదగిరి, సుభాష్, రాములు పాల్గొన్నారు.

దేశాభివృద్ధి, సంక్షేమం బీజేపీతోనే సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి

రాజేంద్రనగర్: దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఉప్పర్‌పల్లి ఎస్‌బీ గార్డెన్‌లో రంగారెడ్డి జిల్లా అర్బన్ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రేమేందర్ రెడ్డి కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. 2023 ఎన్నికలు టార్గెట్ అని... ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గ్రామాల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన పథకాలపై వివరించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ పథకాలను కొన్నింటిని అమలు చేయకుండా పేదలకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. ఎన్నికల ముందు సీఎం కేసీఆర్ ఇచ్చిన రైతు రుణమాఫీ, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి, దళితులకు మూడెకరాల భూమి వంటి హామీలు ఇప్పటి వరకు అమలు చేయకుండా మోసం చేశారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండెల లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, క్లోం రవీందర్ రెడ్డి, ఎస్.మల్లారెడ్డి, ఉపేందర్ రెడ్డి, జి.యోగానంద, కొమరయ్య, కొప్పుల నరసింహారెడ్డి, మల్లేష్ యాదవ్, రాచూరి రాజశేఖర్, టి.సుధాకర్ రెడ్డి, బొక్క బాల్‌రెడ్డి, అడికే రాజు, సత్యనారాయణ ముదిరాజ్, ఎస్.విజయ్, జనార్దన్ ,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ శిబిరం



శిక్షణ ఇస్తున్న నిర్వాహకులు

అఫ్జల్‌గంజ్: మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ఉచిత టైలరింగ్ శిక్షణ ఇస్తున్నట్లు సత్యసాయి సేవా సంస్థలు, కోఠి సమితి కన్వీనర్ విశ్వేశ్వరశాస్త్రి తెలిపారు. మంగళవారం తోప్‌ఖానాలోని సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 17 బ్యాచ్‌ల ద్వారా దాదాపు 400 మంది ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చామన్నారు. 18వ బ్యాచ్‌ను మంగళవారం ప్రారంభించామని 100 రోజుల పాటు కొనసాగిస్తామన్నారు. ఆసక్తి గల మహిళలు తోప్‌ఖానాలోని సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో లేదా 88865 09410 లో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



సమ్మర్ క్యాంపులో శిక్షణ పొందిన విద్యార్థులు

విజయనగర్‌కాలనీ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సెయింట్‌ఆన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ పుష్ప మేరి అన్నారు. ఆసిఫ్‌నగర్ సెయింట్‌ఆన్స్ పాఠశాలలో గత నెల 26న ప్రారంభమైన సమ్మర్ క్యాంప్ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. స్కేటింగ్, క్లాసికల్ డ్యాన్స్, కరాటే, బాస్కెట్‌బాల్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ తదితర అంశాల్లో నెలరోజుల పాటు నిర్వహించిన సమ్మర్ క్యాంపులో విద్యార్థులు తమ ప్రతిభను చాటారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



పడిపోయినప్పుడు...



ప్రాణం పోసుకున్న చెట్టు వద్ద ఫౌండేషన్ సభ్యులు

నేలకొరిగితే..నిలబెట్టారు

మాదాపూర్: నేలకొరిగిన ఓ చెట్టుకు మళ్లీ ప్రాణం పోశారు. మాదాపూర్‌లోని నోవాటెల్ వద్ద 30 ఏళ్ల వయసు ఉన్న చెట్టు ఇటీవల కురిసిన వర్షానికి నేలకొరిగింది. విషయం తెలుసుకున్న బీజేపీ నేత గంగుల రాధాకృష్ణ యాదవ్ చొరవ తీసుకుని వాటా ఫౌండేషన్, నోవాటెల్ యాజమాన్యం సహకారంతో వృక్షానికి తిరిగి పునర్జీవం పోశారు.

హుక్కా పార్లర్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

●16 మంది అరెస్టు

నాంపల్లి: హబీబ్‌నగర్‌లో ఓ హుక్కా పార్లర్‌పై సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం అర్ధరాత్రి దాడి చేశారు. హుక్కా పార్లర్‌లో పనిచేస్తున్న ముగ్గురు సిబ్బందితో పాటుగా హుక్కా సేవించడానికి వచ్చిన 13 మంది వినియోగదారులను అరెస్టు చేశారు. హుక్కా పార్లర్ నిర్వాహకుడు పరారు అయ్యాడు. ఈ దాడిలో రూ.8,800 నగదుతో పాటుగా వివిధ రకాల నికోటిన్ పదార్థాలను సీజ్ చేశారు. తదుపరి విచారణ నిమిత్తం పట్టుబడిన నిందితులను హబీబ్‌నగర్ పోలీసులకు అప్పగించారు. పోలీసుల వివరాల ప్రకారం.. యూసుఫియన్ దర్గా ఎక్స్ రోడ్డు సమీపంలో హోటల్ మెరీడియన్ పార్క్ పైన దుబాయ్ షీషా లాంజ్ శైలిలో తలాబ్ కట్టకు చెందిన ఇమ్రాన్ హుక్కా సెంటర్ నిర్వహిస్తున్నారు. మొగల్‌పురా వాటర్ ట్యాంక్ సమీపంలో నివాసం ఉండే మహ్మద్ అక్బర్ కుమారుడు మహ్మద్ సుల్తాన్(29), చార్మినార్‌కు చెందిన షేక్ మగ్దూమ్ కుమారుడు షేక్ ఎజాజ్(21), ఫలక్‌నుమా ఎస్.ఎస్.కుంట ప్రాంతానికి చెందిన షేక్ సబీర్ కుమారుడు షేక్ సజీద్(21) హుక్కా సెంటర్‌లో కార్మికులుగా పనిచేస్తున్నారు. హుక్కా పార్లర్ నిర్వాహకుడు ఇమ్రాన్ చట్ట విరుద్ధంగా వినియోగదారులకు హుక్కా కుండలను అందజేస్తున్నారు. నికోటిన్ రుచులను కుండల్లో కలిపి అధిక ధర వసూలు చేయడం ద్వారా అక్రమ లాభాలు పొందుతున్నారు. విశ్వసనీయ సమాచారంతో సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం హుక్కా సెంటర్‌పై దాడి చేశారు. హుక్కా పార్లర్‌లో పనిచేసే సిబ్బందితో పాటుగా 13 మంది వినియోగదారులను అరెస్టు చేశారు. వీరిలో కొందరు మైనర్లు కూడా ఉన్నారు. హబీబ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని తీసుకురావాలి

సుల్తాన్‌బజార్: న్యాయవాదులపై దాడుల నివారణకు న్యాయవాదుల సంరక్షణ చట్టం తీసుకురావాలని బార్‌కౌన్సిల్ సభ్యులు కొండారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో భారత ప్రజా న్యాయవాదుల సంస్థ, లాయర్స్ కౌన్సిల్ పౌరహక్కుల సంఘం, పీయూసీఎల్, బార్‌కౌన్సిల్ సభ్యులు మాట్లాడారు. ఇటీవల నల్గొండ జిల్లా తిరుమలగిరిలో యువ న్యాయవాది యుగేందర్‌పై స్థానిక ఎమ్మెల్యే అనుచరులు దాడిచేశారని ఆరోపించారు. అలాగే మరో ఘటనలో చర్లపల్లి సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ సంతోష్‌కుమార్ రాయ్ అనే జైలర్ న్యాయవాది డి.సురేష్‌కుమార్‌పై నిందపూర్వకంగా పత్రికా ప్రకటన ఇవ్వడాన్ని ఆయా సంఘాల నాయకులు ఖండించారు. ఈ సమావేశంలో సైదారావు, ఉపాధ్యక్షుడు వెంకన్న, నారాయణరావు, విష్ణువర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జీఓ 111పై ప్రజల్లోకి వచ్చి మాట్లాడాలి

● బీఆర్ఎస్ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకట్‌రెడ్డి

మణికొండ: మూడు దశాబ్దాలుగా 84 గ్రామాల ప్రజలు జీఓ 111ను తొలగించాలని చేసిన ఉద్యమాలు, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు చేసిన తీర్మానాలను లెక్క చేయకుండా జీఓను ఉంచాలని మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దమ్ముంటే ఆయా గ్రామాల ప్రజల్లోకి వచ్చి చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకట్‌రెడ్డి సవాల్ చేశారు. ఆయన మంగళవారం నార్సింగిలో విలేకరులతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డికి పిచ్చి ముదిరిందని, వెంటనే ఎర్రగడ్డ ఆసుపత్రిలో చేర్పించి వైద్య పరీక్షలు చేయించాల్సిన అవసరం ఉందన్నారు. 84 గ్రామాల ప్రజలు సుదీర్ఘ పోరాటాల తరువాత 2009 ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీ నేతగా, ఉద్యమకారుడిగా ఇచ్చిన హామీతో పాటు తరువాత ముఖ్యమంత్రి అయ్యాక కేసీఆర్ హామీని నిలుపుకునేలా ప్రభుత్వం జీఓ 111ను తొలగించిందన్నారు. ఆ విషయాన్ని ఓర్వలేక ఇష్టారాజ్యంగా పిచ్చిపట్టినట్టు మాట్లాడుతున్నారన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సమైక్యవాది చంద్రబాబు కాళ్ల వద్ద తమ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిన వ్యక్తి కేసీఆర్, కేటీఆర్‌ల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఉచిత వైద్య విధానాన్ని ప్రవేశపెట్టాలి

సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించాలని ఈనెల 24న ఉదయం 10 గంటలకు ఇందిరా పార్కులోని ధర్నా చౌక్ వద్ద నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు పీపుల్ ప్రొటెక్షన్ పార్టీ అధ్యక్షుడు సదానందరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 24న నిర్వహించే నిరాహార దీక్షకు విద్యార్థుల తల్లిదండ్రులు, నాయకులు, రాజకీయ నాయకులు, ఉద్యమకారులు, మేధావులు, కవులు, కళాకారులు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఉచిత విద్య వైద్య సాధన సమితి అధ్యక్షులు నారగోని ప్రవీణ్ కుమార్, నర్సింహాగౌడ్, వెంకటేశ్వర్, దానమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

మల్లేపల్లి ఐటీఐలో బోనాల సంబురాలు



అమ్మవారికి బోనాలు సమర్పించిన ఉద్యోగులు

విజయనగర్‌కాలనీ: మల్లేపల్లి ఐటీఐలో ఉద్యోగులు మంగళవారం బోనాల పండుగ సంబురాలు నిర్వహించారు. ఐటీఐ ప్రాంగణంలో నెలకొన్న పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధి శిక్షణశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఐటీఐలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ శిక్షణాధికారులను రెగ్యులరైజ్ చేసేందుకు సీఎం కేసీఆర్ సుముఖత వ్యక్తం చేయడంతో తాము అమ్మవారికి బోనాలు సమర్పించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి తమను రెగ్యులరైజ్ చేసినందుకు తాము తమ శక్తివంచన లేకుండా విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన గుణాత్మకమైన శిక్షణను అందించి నూరు శాతం ఉత్తీర్ణత తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మల్లేపల్లి ఐటీఐ ప్రిన్సిపాల్ పి.జ్యోతిరాణి, శివనాయక్, నాగరాణి, బాలవర్ది రాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.2వేల నోటు రద్దుతో బంగారు షాపులకు క్యూ

అఫ్జల్‌గంజ్: ఆర్బీఐ రూ.2వేల నోటన్లు రద్దు చేయడంతో ప్రజలు బంగారు షాపులకు క్యూ కట్టారు. బ్యాంకులో ఒకసారి కేవలం రూ.20 వేల వరకు మార్చిడి అవకాశం ఇవ్వడంతో జనం తమ పంథా మార్చుకున్నారు. బ్యాంకుల వద్ద రద్దీని దృష్టిలో ఉంచుకొని బంగారు ఆభరణాల కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు. సెప్టెంబర్ చివరి వరకు అవకాశం ఉన్నా ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బంగారం కొంటే భవిష్యత్‌లో పెట్టుబడిగా పనికి వస్తుందంటున్నారు.

WANTED LECTURERS
For ALL SUBJECTS
Contact Nos: 8499081550, 9000128831
SRI CHAITANYA JUNIOR COLLEGE
Pillar No.200, Upperpally, Rajendra Nagar, R.R.Dist.

SRI CHAITANYA JUNIOR COLLEGE
Recognised by the Govt. of T.S.
Pillar No. 200, Upperpally, Rajendra Nagar, R.R. Dist.
Courses Offered: SEPARATE BUILDINGS FOR GIRLS & BOYS
MPC + IIT, JEE MAINS | BiPC + NEET & EAMCET | MEC | CEC
TRANSPORTATION FACILITY FOR GIRLS
ADMISSIONS OPEN
For Details Contact: 8499081550, 9000128831
WANTED LECTURERS FOR ALL SUBJECTS



సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230